విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



వాజేడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని వసతిగృహం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. 'దోమల మోత.. చలితో వెత..!' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు గురువారం ములుగు జిల్లా కేంద్రం నుంచి దుప్పట్లు తీసుకొచ్చి స్పీ బాలుర వసతిగృహంలోని 45 మంది విద్యార్థులకు వసతిగృహ సంక్షేమాధికారి శ్రీనివాస్ అందజేశారు. అదేవిధంగా వసతిగృహాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీవో శ్రీకాంత్ పనులను పర్యవేక్షించారు.

క్రెచ్ కేంద్రాల ఏర్పాటును నిలిపివేయాలని వినతి



ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఏర్పాటు చేయనున్న క్రెచ్ కేంద్రాల ఏర్పాటుపై ములుగు జిల్లా అంగన్‌వాడీ సంఘం నాయకులు హైదరాబాదులోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఆకేశ్వర్‌రావుతో గురువారం చర్చలు జరిపారు. క్రెచ్ కేంద్రాల ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని డిమాండు చేశారు. విధి విధానాలు ప్రకటించిన తర్వాత సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. జేడీని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, సీఐటీయూ ములుగు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రేంజ్ అధికారిగా బాధ్యతల స్వీకరణ



నరేందర్

తాడ్వాయి, న్యూస్‌టుడే: అటవీశాఖ వన్యప్రాణి విభాగం తాడ్వాయి రేంజ్ అధికారిగా నరేందర్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణవేణి దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో ఏటూరునాగారంలో విధులు నిర్వహిస్తున్న నరేందర్‌ను నియమిస్తున్నట్లు డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు విధుల్లో చేరిన నరేందర్‌ను అధికారులు, సిబ్బంది అభినందించారు.


చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక



భీమనాథుని సత్యనారాయణ

భూపాలపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భూపాలపల్లి పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన భీమనాథుని సత్యనారాయణను ఎంపిక చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సమావేశంలో చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిన సత్యనారాయణకు రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సత్యనారాయణను ములుగు జిల్లా ఇన్‌ఛార్జిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. పద్మశాలీ జాతి చైతన్యం కోసం, చేనేత పరిశ్రమ పరిరక్షణకు నిరంతరం కృషి చేయనున్నట్లు సత్యనారాయణ తెలిపారు.

మున్సిపాలిటీ ఏర్పాటుకు గ్రామాల విలీనం?



ములుగు, న్యూస్‌టుడే: మున్సిపాలిటీగా కార్యరూపం దాల్చనున్న ములుగులో మరిన్ని గ్రామాలను విలీనం చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా అధికారులు గ్రామసభలు నిర్వహించి మరిన్ని గ్రామాల విలీనానికి మార్గం సుగమం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామాల విలీనాన్ని కొందరు తిరస్కరిస్తున్నారు.

2022లో బిల్లుకు రూపకల్పన

సెప్టెంబర్ 12, 2022న ములుగును మున్సిపాలిటీగా ప్రతిపాదిస్తూ బిల్లును అప్పటి భారాస ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆ తర్వాత రెండు చట్టసభల్లో ఆమోదించిన రాష్ట్ర గవర్నర్‌కు పంపించగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లోనే ఉంది. 2023లో శాసనసభ, 2024లో లోక్‌సభ ఎన్నికలు జరగడం, అప్పుడు గవర్నర్‌గా ఉన్నటువంటి తమిళిసై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆమె తన గవర్నర్ పదవికి రాజీనామా చేయడం, కొత్త గవర్నర్లు అదనపు బాధ్యతలు అప్పగించడంతో పాటు సుమారు రెండు నెలలు ఎన్నికల కోడ్ ఉండటంతో బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. మున్సిపాలిటీ ఏర్పాటులో ఆలస్యం కావడంతో.. జిల్లా ప్రజల్లో అపోహలు పెరిగిపోయాయి. జిల్లా కలెక్టర్ దివాకర బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందని, ఇటీవల ఓ ప్రకటన ద్వారా వెల్లడించి ప్రజల అనుమానాలకు తెర దించారు.

రాష్ట్రపతికి విజ్ఞప్తి

ములుగు మున్సిపాలిటీకి సంబంధించిన గత ప్రభుత్వంలో ములుగు పట్టణంతో పాటు బండారుపల్లి, జీవంతరావుపల్లి గ్రామాలతో అప్పటి భారాస ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి గవర్నర్ ఆమోదానికి పంపించారు. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్మును రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మర్యాదపూర్వకంగా కలిసిన సమయంలో పెండింగ్‌లో ఉన్న ములుగు మున్సిపాలిటీ బిల్లును ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

పీఆర్ కమిషనర్‌కు ప్రతిపాదనలు

2019 ఫిబ్రవరి 17న ములుగు జిల్లా ఏర్పడింది. మున్సిపాలిటీ చేయడానికి ములుగు పట్టణ జనాభా తక్కువగా ఉండటే కారణంతో జాప్యం చేశారు. జిల్లా ఏర్పాటు తర్వాత కూడా ములుగు పంచాయతీగానే కొనసాగడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మున్సిపాలిటీ కోసం కసరత్తు చేసిన జిల్లా ఉన్నతాధికారులు ఓ నిర్ణయానికి వచ్చి 2022 సెప్టెంబరు 6న రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు ప్రతిపాదించారు. ములుగు పంచాయతీ జనాభా, ఓటర్లు, వార్డులు, ఆదాయం, వ్యయం, విలీనం చేయనున్న పంచాయతీలు, వాటి గణాంకాలు మొదలగు వివరాలను సేకరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు.

గ్రామసభల్లో తీర్మానం

మరిన్ని పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేయాలని కొత్త ప్రతిపాదన చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ములుగు మండల పరిధిలోని జాకారం పంచాయతీని విలీనం చేసే ప్రక్రియలో భాగంగా ఈనెల 21వ తేదీన జాకారంలో గ్రామసభ నిర్వహించారు. విలీనం చేయాలనే ప్రతిపాదనను కొందరు తిరస్కరిస్తూ.. అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఈనెల 22న మళ్లీ గ్రామసభ నిర్వహించగా.. నిర్ణయానికి గ్రామపెద్దలు ఒకరోజు సమయం కావాలని అడిగారు. తిరిగి ఈనెల 23న గ్రామసభ ఏర్పాటు చేసి పంచాయతీ విలీనానికి అందరి సమక్షంలో తీర్మానించారు.

కొత్త గ్రామాల విలీనమెలా..

ప్రస్తుతం బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న సమయంలో కొత్త పంచాయతీలను ఎలా విలీనం చేస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొత్త పంచాయతీల విలీనంతో మళ్లీ కొత్తగా మున్సిపాలిటీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడతారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇన్నిరకాల సందేహాల నేపథ్యంలో కొత్త గ్రామాల విలీనంపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది.

పోరాట యోధుల చరిత్రను ముందుతరాలకు అందించాలి



ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క, వేదికపై ఆదివాసీ సంఘాల నాయకులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: జల్, జమీన్, జంగిల్ కోసం నిజాం ప్రభుత్వంతో పోరాటం చేసిన కుమురం భీం వంటి పోరాట యోధుల చరిత్రను ముందుతరాలకు అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీ సమాజానికి, దళిత, బడుగు, బలహీనవర్గాలకు ఎంతో స్ఫూర్తి ప్రదాతలన్నారు. గురువారం ఏటూరునాగారంలోని వై జంక్షన్ వద్ద కుమురం భీం విగ్రహాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆనాడు జల్, జమీన్, జంగిల్, అనే నినాదాలతో ఆదివాసీల కోసం పోరాటం చేశారని, అదే పోరాట స్ఫూర్తి తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. కుమురం భీం పోరాట మూలంగానే భూ పోరాటాలు, ఐదో షెడ్యూలు, భూమి మీద హక్కులు, పోడు హక్కులు, సబ్‌ప్లాన్, ఐటీడీఏలు వచ్చాయని తెలిపారు.

ఐటీడీఏ అభివృద్ధికి కృషి

ఆదిలాబాద్ నుంచి ఖమ్మం ఉన్న ప్రాంతాల్లో వలసలను నివారించుకోవాల్సిన అవసరముందన్నారు. ఆదివాసీలు, ఆదివాసీయేతర ప్రజలు అంతా ఐక్యతగా ఉండాలని సూచించారు. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాతో ప్రత్యేకమైన చట్టాలు, హక్కులు, ఇలాంటి పరిస్థితుల్లో శాంతియుత వాతావరణంలో వలసలు రాకుండా నివారించుకోవాలని చెప్పారు. ప్రత్యేక రిజర్వేషన్లు, చట్టాలు ఉన్నందున ఒకరికొకరు ఆత్మీయతతో ముందుకు సాగాలని కోరారు. గతంలో ఐటీడీఏలు కలకళలాడేవని, జిల్లా కలెక్టర్లతో సమానంగా ఐటీడీఏలకు నిధులు వచ్చేవన్నారు. నిధులు, ఉద్యోగ, ఉపాధి, పోడు భూములు, నీళ్లు, ఐటీడీఏ బలోపేతానికి సీఎం చర్చించి అభివృద్ధికి కృషి చేస్తానని, గిరిజన సలహా మండలి సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మెల్యే మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొర, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ములుగు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ భిక్షపతిరావు, నాయకులు పొడెం రత్నం, అట్టం నారాయణ, పొడెం కృష్ణప్రసాద్, రమణాల లక్ష్మయ్య, మైపతి అరుణ్‌కుమార్, దబ్బ సుధాకర్, సిద్ధబోయిన జగ్గారావు, సిద్ధబోయిన రాంబాబు, చేల బాబూరావు, కొప్పుల రవి, నల్లబోయిన కోటయ్య, పొడెం బాబు, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పడి చదవాలి

ఏటూరునాగారం ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో పది మంది విద్యార్థినులకు కంప్యూటర్లను అందజేశారు. మౌరిటెక్ ఐటీ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లాకు వంద కంప్యూటర్లు అందించారు. అందులోంచి 10 ఏటూరునాగారం జడ్పీ ఉన్నత పాఠశాలకు అందజేశారు. భవితకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని, పోటీపడి చదవాలని విద్యార్థులకు సూచించారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



కమలాపురం గ్రామంలో సభ్యత్వం అందజేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు బలరాం

కమలాపురం(మంగపేట), న్యూస్‌టుడే: అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలని భాజపా జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం అన్నారు. గురువారం మంగపేట మండలంలోని కమలాపురం గ్రామంలో ఆ పార్టీ మండల ప్రధానకార్యదర్శి చల్లా రాంభీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 30 వరకు సభ్యత్వ నమోదు తేది పొడిగించడం జరిగిందని, గ్రామాల్లో పార్టీకి ఆదరణ పెరిగిందని బలరాం పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రతి నాయకుడు, కార్యకర్త ఎక్కువ మొత్తంలో నమోదయ్యేలా కృషి చేయాలన్నారు. మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. అన్నిరంగాల అభివృద్ధికి భాజపా కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షులు జినుగుల కృష్ణారావు, నాయకులు భూక్య జవహర్‌లాల్, భర్తపురం నరేష్, రవీంద్రాచారి, లింగంపెల్లి శ్రీనివాసరావు, యాకూబ్‌పాషా, లోడె శ్రీనివాస్, జానకిరావు, బొల్లికొండ సాంబయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు గొప్పవి



అదనపు ఎస్పీకి రక్తదాన ధ్రువపత్రం అందజేస్తున్న ఎస్పీ శబరీష్

ములుగు టౌన్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ములుగు జిల్లా పోలీసు అధికారి ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. పోలీసు అమరవీరుల త్యాగాలకు స్ఫూర్తిగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, వారి త్యాగాలు గొప్పవన్నారు. శిబిరంలో మొత్తం 50 యూనిట్ల రక్తాన్ని సేకరించామని అదనపు ఎస్పీ సదానందం తెలిపారు. అనంతరం దాతలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ములుగు సీఐ శంకర్, ఇన్‌స్పెక్టర్ తిరుపతి రెడ్డి, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది, యువత పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరల్డ్ హెరిటేజ్ శిక్షణ శిబిరం



కొమ్ము నృత్యం చేస్తున్న గొత్తికోయలు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: ఈనెల 26 వరకు రామప్పలో కొనసాగనున్న వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ల శిక్షణ శిబిరం కొనసాగుతుంది. గురువారం పదో రోజుకు చేరిన శిబిరంలో వాలంటీర్లు ఉదయాన్నే రామప్ప గార్డెన్‌లో యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. శిబిరంలో భాగంగా ములుగు జిల్లాలోని లక్నవరం, మేడారం, ఏటూరునాగారం మండలంలోని చింతలమోరి గొత్తికోయ గూడేలను సందర్శించారు. గొత్తికోయలు సంప్రదాయ దుస్తువుల్లో నృత్యాలు చేశారు. అనంతరం వారి సంస్కృతీ, సాంప్రదాయాలపై, మేడారం సమ్మక్క సారలమ్మ చరిత్ర, లక్నవరం ప్రకృతి అందాలను చెరువు నిర్మాణ విశిష్టత గురించి ప్రొఫెసర్ పాండురంగారావు వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్



ములుగు, న్యూస్‌టుడే: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బానోతు రవిచందర్ గురువారం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకరను మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్కను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా రవిచందర్‌కు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండి.చాంద్‌పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మావూరపు తిరుపతి రెడ్డి, నాయకులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

అనిశాకు పట్టుబడ్డ పీఆర్ ఉద్యోగులు



నగదుతో పట్టుబడ్డ పీఆర్ ఈఈ దిలీప్, అసిస్టెంట్ టెక్నికల్ అధికారి చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఈఈ దిలీప్‌తో పాటు అసిస్టెంట్ టెక్నికల్ అధికారి చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి రూ.20 వేల లంచం తీసుకుంటూ గురువారం అనిశాకు చిక్కారు. అనిశా డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మల్హర్‌రావు మండలం తాడిచర్లకు చెందిన సదానందం అనే గుత్తేదారు 2023లో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి చేసిన పనులకు రూ.10 లక్షలకు గాను 5.23 లక్షలు మంజూరయ్యాయి. తర్వాత ఫైనల్ బిల్ రూ.4.77 లక్షల మంజూరుకు పాస్ ఆర్డర్ ఇచ్చేందుకు పీఆర్ ఈఈ దిలీప్‌కు రూ.10 వేలు, ఇద్దరు సిబ్బందికి రూ.5 వేల చొప్పున లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు 15 రోజుల నుంచి ఇబ్బంది పెడుతుండగా విసిగి వేసారిన గుత్తేదారు వరంగల్ అనిశా అధికారులను ఆశ్రయించాడు. అనిశా అధికారుల సూచన మేరకు గురువారం సాయంత్రం 5:40 గంటల సమయంలో గుత్తేదారు కలెక్టరేట్‌లోని పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో అధికారులకు డబ్బులు ఇస్తుండగా వెంటనే పట్టుకుని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని శుక్రవారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్‌సుందర్, ఎల్.రాజు, ఎస్.రాజు పాల్గొన్నారు.

కెపాసిటర్ల బిగింపుతో హెచ్చుతగ్గుల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఏడీఈ స్వామిరెడ్డి

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండలంలోని యోగితనగర్ గ్రామంలో గురువారం విద్యుత్తు అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు విధిగా తమ వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, దీంతో కరెంటు హెచ్చుతగ్గుల నియంత్రణ ఉంటుందన్నారు. నియంత్రికలపై భారం పడదన్నారు. రైతులు ఉచిత విద్యుత్తు సరఫరాను వినియోగించుకోవాలన్నారు. ఏడీఈ స్వామిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు, న్యూస్‌టుడే: రాష్ట్ర పారామెడికల్ బోర్డు అందిస్తున్న డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు అన్ని ధ్రువపత్రాల ప్రతులను జత చేయాలన్నారు. www.tgpmb.telanga.gov.in అనే వెబ్‌సైట్లో, ములుగు జిల్లా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7013952246 నెంబరులో సంప్రదించాలని కోరారు.

నకిలీ పోడుపట్టాల తయారీలో మరో ముగ్గురి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న డీఎఫ్ఓ రాహుల్‌కిషన్ జాదవ్

ములుగు టౌన్, న్యూస్‌టుడే: నకిలీ పోడు పట్టాల తయారీలో అటవీ అధికారులు గురువారం మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఇద్దరిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన వరంగల్ నగరానికి చెందిన గణేష్ ప్రింటర్స్ యజమాని తాటిపాముల రాజు, పోడు పట్టాపుస్తకానికి క్యూఆర్ కోడ్ సృష్టించిన భూక్య వెంకన్న, అటవీ హక్కు పాసు పుస్తకం నమూనాను పంపిన జాటోత్ రాజ్‌కుమార్(ఎఫ్ఆర్సీ ఛైర్‌పర్సన్)లను అదుపులోకి తీసుకుని జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్‌జాదవ్ గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. గణేష్ ప్రింటర్స్ యజమాని రాజు అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి పాసు పుస్తకాన్ని తయారు చేశాడన్నారు. అతడి కంప్యూటర్‌ను తనిఖీ చేయగా.. ములుగు, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల పేర్లతో సుమారు 500 నకిలీ పోడు పట్టా పుస్తకాలు తయారు చేసినట్లు సమాచారం ఉందని, కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. హోలోగ్రామ్ తయారుచేసిన బానోత్ హరినాయక్, అటవీ శాఖ రేంజ్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి క్లియరెన్స్ ధ్రువీకరణ పత్రాన్ని రూపొందించిన దారావత్ కిషన్‌లు పరారీలో ఉన్నారన్నారు. ములుగు ఏపీజీవీబీ బ్యాంకులో రుణం పొందిన ఆరు పుస్తకాలను, ములుగు మండలం కాసిందేవిపేట పంచాయతీ పరిధి రామయ్యపల్లి గ్రామంలో రైతుల వద్ద నుంచి మూడు పుస్తకాలను సేకరించామన్నారు. గతంలో పనిచేసిన ములుగు జిల్లా కలెక్టర్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో, జిల్లా అటవీశాఖ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి పెద్దఎత్తున రైతుల నుంచి ఒక్కో పుస్తకానికి రూ.30 నుంచి 50 వేల వరకు వసూలు చేసినట్లు వివరించారు. అంతకుముందు అదుపులోకి తీసుకున్న ఇద్దరితో పాటు గురువారం అదుపులోకి తీసుకున్న ముగ్గురిని పోలీసుస్టేషన్‌కు పంపిస్తామని డీఎఫ్‌వో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో శంకర్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రవాణా సేవల్లో డీడీల హైరానా!

దళారులను ఆశ్రయిస్తేనే పని..


ఎనుమాముల మార్కెట్ ప్రాంతానికి చెందిన సూర్య టాటాఏస్ వాహనానికి సరైన పత్రాలు లేకపోవడంతో ఇటీవల భూపాలపల్లి జిల్లాలో సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పట్టుబడిన వాహనాన్ని విడిపించుకునేందుకు వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి రాగా రూ.7,225 జరిమానా విధించారు. ఈ మొత్తం డీడీ రూపంలో చెల్లించేందుకు బ్యాంకులు చుట్టూ తిరిగినా.. ఫలితం లేకపోవడంతో కార్యాలయం పరిసరాల్లోని దళారిని ఆశ్రయించాడు. ఒక డీడీలో ఈ మొత్తం లేక పోవడంతో రెండు డీడీలు ఇచ్చాడు. ఒక డీడీకి రూ.200 చొప్పున రూ.400 అదనంగా చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా దళారీ లేనిదే డీడీ పని కావడం లేదు. డీడీల బదులు అంతర్జాలంలో చెల్లించేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. -రంగశాయిపేట, న్యూస్‌టుడే

రవాణాశాఖ కార్యాలయాల్లో డీడీ(డిమాండ్ డ్రాఫ్ట్) ద్వారా చెల్లింపులు చేయాలనే నిబంధన వాహనదారులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. నగదు రహిత, ఆన్‌లైన్ సేవలకు అవకాశం ఉన్నా ఇప్పటికీ కొన్ని ఆఫ్‌లైన్‌లోనే కొనసాగుతున్నాయి. వీటిని అధిగమించాలంటే.. రవాణాశాఖ అంతర్జాల సేవలు మెరుగుపరచాలి.



వరంగల్ ఆర్టీఏ కార్యాలయం

ఇప్పటికే వాహనదారులు రుసుంలన్నీ మీ-సేవ, ఈ-సేవ, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లిస్తున్నారు. ఇదే విధానం రవాణాశాఖ అంతర్జాలంలోనూ అమలు చేస్తున్నారు. మరిన్ని రుసుంలు సైతం చరవాణి సాయంతో ఫోన్ పే, గూగుల్ పే, ఇతర యాప్‌ల ద్వారా చెల్లించేలా చూడాలి. లేదంటే రవాణాశాఖ ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా నేరుగా దరఖాస్తుదారుడి చరవాణికి ఎస్ఎంఎస్ పంపించేలా మార్పులు చేయాలి. కార్యాలయాల్లో దరఖాస్తు నంబరును నిక్షిప్తం చేస్తే స్కానర్ వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఈ విధానం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నారు.



ఆందోళన

చేతివాటం ప్రదర్శిస్తున్న దళారులు

ఇదే అదనుగా దళారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాహనదారులకు అవసరమైన డీడీలను దళారులు నిల్వ చేసి ఎక్కువ మొత్తంలో విక్రయిస్తున్నారు. పనులు తొందరగా ముగించుకోవాలనే దృక్పథంతో కార్యాలయాల పరిసరాల్లో ఉన్న దళారులను ఆశ్రయించడంతో చెప్పినంత అదనంగా చెల్లించి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. లేదంటే వచ్చిన పని మరో రోజుకు వాయిదా పడుతుంది. బ్యాంకర్లు కొత్త నిబంధనలతో దళారుల పంట పండుతుంది.

బ్యాంకుల్లో తప్పని ఇక్కట్లు

వాహనదారులు రుసుంలు, చెల్లింపులు డీడీ రూపంలో చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డీడీ కోసం బ్యాంకుల కోసం వెతకాల్సిన పరిస్థితి. బ్యాంకు వరకు వెళ్ల వాతావరణంలో డీడీలు ఇవ్వమని నిబంధన పెట్టడంతో తలపట్టుకుంటున్నారు. గతంలో నేరుగా ఇచ్చేవారు. నూతన విధానంతో వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే తమకు ఖాతాలు ఎలా ఉంటాయని వాపోతున్నారు.

సమయం వృథా..

వాహన పన్నులు, జరిమానాలు, ఇతర రాష్ట్రాల వాహనాల మార్పు, ఇతర కేసుల నమోదు చేసిన సమయంలో చెల్లించాల్సిన రుసుం లన్నీ డీడీల రూపంలోనే కార్యాలయాల్లో తీసుకుంటున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో డీడీ నంబరు, బ్యాంకు పేరు, ఇతర వివరాలు నమోదు చేస్తారు. వచ్చిన డీడీలను ప్రతిరోజు ఓ వ్యక్తి ట్రెజరీలో జమ చేయాల్సి ఉంటుంది. దీంతో చాలా సమయం వృథా అవుతోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజు జరిగే వాహనాల రిజిస్ట్రేషన్లు, కార్యాలయానికి వచ్చే డీడీల సంఖ్య వివరాలు (సుమారుగా)

జిల్లా	రిజిస్ట్రేషన్లు	డీడీలు
హనుమకొండ	70	40
వరంగల్	60	30
జనగామ	40	25
మహబూబాబాద్	45	25
భూపాలపల్లి	30	20
ములుగు	30	20

రెండు నెలల్లో మార్పులు వస్తాయి

- పుప్పాల శ్రీనివాస్ రవాణాశాఖ ఉప కమిషనర్



రవాణాశాఖ కార్యాలయాల్లో మరో రెండు నెలల్లో సమగ్ర మార్పులు వస్తాయి. వాహనదారులు ఎదుర్కొంటున్న డీడీల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి చాలా సార్లు తీసుకెళ్లాం. సాంకేతిక పరమైన మార్పులు, డిజిటలైజేషన్ ప్రక్రియపై ప్రణాళిక చేస్తున్నారు. త్వరలోనే అమలు చేసేందుకు కసరత్తులు జరుగుతున్నాయి.

ఇదీ నేపథ్యం..

వరంగల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని శాయంపేట హవేలీ, స్టేషన్ చింతలపల్లి గ్రామాల్లో కాకతీయ మెగా జౌళి వస్త్ర పరిశ్రమకు 2017 అక్టోబరు 22న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) ద్వారా 1350 ఎకరాల భూమిని సేకరించింది. ప్రాజెక్టు వ్యయం రూ.1150.47 కోట్లు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఇందులో మౌలిక సదుపాయాల కోసం రూ.706.87 కోట్లను ఖర్చు చేసింది. ప్రధానంగా భూసేకరణకు రూ.159.27 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ. 547 కోట్లను వెచ్చించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయనేది అంచనా.

కాకతీయకు కైటెక్స్ కళ!

పరకాల, గీసుకొండ, న్యూస్‌టుడే

● డిసెంబరులో వస్త్ర పరిశ్రమ ప్రారంభానికి సన్నాహాలు

వరంగల్ ఉమ్మడి జిల్లాకు తలమానికంగా నిలుస్తున్న కాకతీయ మెగా జౌళి టెక్స్‌టైల్ పార్కులో త్వరలో మరో వస్త్ర పరిశ్రమ ప్రారంభం కాబోతోంది. దుస్తుల తయారీ సంస్థలో పేరు పొందిన 'కైటెక్స్' పనులు చివరి దశకు చేరుకున్నాయి. డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.



కాకతీయ వస్త్రపరిశ్రమలో కైటెక్స్ కంపెనీ నెలకొల్పిన యూనిట్లు

ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు..

వస్త్రపరిశ్రమకు శంకుస్థాపన చేసి ఏడేళ్లలో ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు యూనిట్లను స్థాపించాయి. గణేష్ ఎకోటెక్, యంగ్‌వన్‌తోపాటు కైటెక్స్ ముందుకొచ్చాయి.

● ఉత్తరప్రదేశ్ కేంద్రంగా పని చేస్తున్న గణేష్ ఎకోటెక్ సంస్థ మొదటిసారిగా 50 ఎకరాల భూమిని తీసుకుని రూ. 500 కోట్ల పెట్టుబడితో రెండు యూనిట్లను ప్రారంభించింది. ఇక్కడ దేశంలోనే మొదటిసారిగా ప్లాస్టిక్ ఖాళీ సీసాలతో దారం తయారు చేసే పరిశ్రమను నెలకొల్పారు. దీని వల్ల 600 మంది ఉపాధి పొందుతున్నారు.

● దక్షిణ కొరియా దేశానికి చెందిన ప్రముఖ యంగ్‌వన్ సంస్థ క్రీడా దుస్తుల పరిశ్రమ నెలకొల్పడానికి ఎవర్‌టాప్ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వస్త్రపరిశ్రమలో 297 ఎకరాల భూమిని తీసుకుంది. ఈ సంస్థ రూ.1000 కోట్ల పెట్టుబడి పెడుతోంది. 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని అంటున్నారు. ప్రస్తుతం ఒక షెడ్డును ఏర్పాటు చేసి 70 మంది మహిళలకు కుట్టుపై శిక్షణ ఇస్తున్నారు. సూరత్, బీవండి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన చేనేత కార్మికుల కోసం వస్త్ర పరిశ్రమలో యూనిట్లు నెలకొల్పడానికి ప్రభుత్వం 52 ఎకరాల భూమిని కేటాయించింది.

ఆనందం

చిన్న పిల్లల దుస్తుల తయారీ ఇక్కడే..

కేరళ కేంద్రంగా ఉన్న కైటెక్స్ సంస్థ చిన్నపిల్లల దుస్తుల తయారీ పరిశ్రమను నెలకొల్పుతోంది. ఈ కంపెనీకి 187.24 ఎకరాల భూమిని కేటాయించారు. ఇది పరిశ్రమ స్థాపనకు రూ. 1200 కోట్లను వెచ్చిస్తోంది. అవసరమైన షెడ్లను నిర్మించి దుస్తుల తయారీకి కావాల్సిన యంత్రాలను అమరుస్తున్నారు. పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ఇది పూర్తయితే 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. తొలుత వెయ్యి మందికి ఉపాధి కల్పించాలని చూస్తున్నారు. జూన్ 29న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్త్ర పరిశ్రమను సందర్శించగా ఇదే కైటెక్స్ కంపెనీలో వన మహోత్సవాన్ని ప్రారంభించారు.

సృజన వీచిక.. ఆవిష్కరణలకు వేదిక



భూపాలపల్లిలో తరగతి గదిలో విద్యార్థులు

SCHOOL INNOVATION MARATHON

న్యూస్‌టుడే, భూపాలపల్లి

ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థులు చిన్న వయసులో ప్రాజెక్టుల రూపకల్పన చేసేలా కేంద్ర ప్రభుత్వం, విద్యా శాఖ 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్' అనే కార్యక్రమం చేపట్టాయి.. భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇదో చక్కటి అవకాశం.. 2024-25 సంవత్సరానికి ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నీతి ఆయోగ్, ఏటీఏఎల్ ఇన్నోవేషన్ మిషన్, యూనిసెఫ్, కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఇన్నోవేషన్ విభాగం, ఏఐసీటీఈ సహకారంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిపై ఇప్పటికే జిల్లాల సైన్సు అధికారులకు, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు, సైన్సు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని భూపాలపల్లి జిల్లా సైన్సు అధికారి బి. స్వామి తెలిపారు.

అవకాశం

ఎవరికి అవకాశం..?: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ అవకాశం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో మొత్తం 3,328 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 85కు పైగా ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. 6 నుంచి 10 తరగతి వరకు 2.41 లక్షల మంది, ఇంటర్‌లో 12 వేలకు పైగా విద్యార్థులున్నారు. ఒక్కో పాఠశాల నుంచి బృందంగా విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పన చేయాలి. ఇద్దరు లేక ముగ్గురు మాత్రమే బృందంలో ఉండాలి. schoolinnovation-marathon.org అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే.. విద్యార్థులు, ఉపాధ్యాయునికి ఎంట్రీ కోర్సు నిర్వహిస్తారు. తర్వాత వారి ఆలోచనలు అందులో పొందుపర్చాల్సి ఉంటుంది. అయితే ప్రాజెక్టుల రూపకల్పన ఏవిధంగా ఉండాలంటే.. సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి. ఇప్పటికే పరిష్కారం కనుగొని ఉంటే.. ఇంకా మెరుగైన పరిష్కారాలు సూచించాలి. ఎంపికైన విద్యార్థులకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక బహుమతులు, ఉన్నత విద్యకు సహకారం అందనుంది.

జనవరిలో విజేతల ప్రకటన: నవంబరు 30 నాటికి ప్రాజెక్టుల రూపకల్పన చేసి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి. వాటిని పరిశీలించి 2025 జనవరిలో వెయ్యి మంది విజేతలను ప్రకటిస్తారు. వచ్చే మే నెలలో విజేతలకు బహుమతులు అందిస్తారు. జులై 29న దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద 'ఇన్నోవేషన్ షో'లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో ప్రతి రాష్ట్రం నుంచి 20 బృందాలను విజేతలుగా ప్రకటిస్తారు. ఇంకా 20 బృందాలు ప్రభుత్వ పాఠశాలల నుంచి, 20 బృందాలు ఉమ్మడి జిల్లా నుంచి, ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి 20 బృందాలను ఎంపిక చేయనున్నారు. భూపాలపల్లి డీఈవో రాజేందర్ మాట్లాడుతూ.. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా హెచ్ఎంలు, సైన్సు అధికారులు ప్రోత్సహించాలని చెప్పారు.

'స్కిల్ డెవలప్‌మెంట్' సభ్యురాలిగా ఎంపీ కావ్య

రంగంపేట, న్యూస్‌టుడే: భారత పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలిగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ఎంపికయ్యారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని ఎంపీ కావ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెచ్చులూడుతున్న పెద్దాసుపత్రి!



వైద్యపరంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కు అయిన ఎంజీఎం ఆసుపత్రి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం రోగులతో సందడిగా ఉండే ఆసుపత్రిలో పలు వార్డుల్లో పెచ్చులూడిపడుతున్నాయి. ఏ క్షణంలో మీద పడతాయో తెలియని పరిస్థితి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలో చాలా ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చినవారు ఇక్కడి పరిస్థితి చూసి ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు. వైద్య సేవల సంగతి పక్కన పెడితే.. వసతి, సౌకర్యాలు తీసికట్టుగా ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల మరమ్మతులు చేసినా.. సమస్య మళ్లీ మొదటికొచ్చింది. పెచ్చులూడి స్లాబులోని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షాలు పడినప్పుడు గోడలు చెమ్మతో మరింత బలహీన పడుతున్నాయి. గత వారం ఓ వార్డులో పెచ్చులూడి కిందపడగా.. త్రుటిలో ప్రమాదం తప్పింది.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి



పురుషుల కొత్త(న్యూ మేల్) మెడికల్ వార్డు వద్ద



ఖైదీల వార్డుకి వెళ్లే దారిలో..



కిచెన్ కాంప్లెక్స్ మార్గంలో..



మహిళల మెడికల్ వార్డు వైపు..



ఆర్ఎంఓ కార్యాలయం వద్ద..

173 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ. 4.48 లక్షల విలువైన 173 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు... పరకాలకు చెందిన బి.రఘు చుట్టపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్‌మిల్లులో నిల్వ ఉంచినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం ఇచ్చింది. దీంతో తనిఖీ నిర్వహించి 60 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే గీసుగొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన జె.వేణు మారుతి మల్టీటెక్ రైస్ మిల్లులో రాయితీ బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసి 95 క్వింటాళ్లు, మడికొండ మండలం అమ్మవారిపేట శివారుల్లోని రాజేశ్‌కు చెందిన మహాలక్ష్మి కోళ్ల ఫారంలో 18 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.



పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కిట్స్ విద్యార్థులకు రూ.14 లక్షల ప్యాకేజీ



ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ. 14 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి గురువారం తెలిపారు. సీఎస్ఈ విభాగానికి చెందిన ఆకాశ్ పున్నం, సీఎస్ఎం చివరి సంవత్సరం చదువుతున్న రాకేశ్ మామిడి ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇటీవల మూడు దశల్లో జరిగిన ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగాలను సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం కంపెనీ ప్రతినిధులు పంపిన నియామక పత్రాలను ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులకు అందజేసి అభినందించారు.

పురపాలికలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

జనగామ, న్యూస్‌టుడే: నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పురపాలికలకు ఉపశమనం లభించనుంది. 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్(బేసిక్) గ్రాంటు కింద నిధులను కేటాయించారు. నాన్‌మిలియన్ ప్లస్ పట్టణాల కేటగిరీలో 2023-24కు సంబంధించి రెండో విడత నిధులను విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని వేతనాలు, నిర్వహణ ఖర్చులకు వినియోగించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. కనీస సౌకర్యాల కల్పన, పారిశుద్ధ్య అవసరాల కోసం వస్తు సామగ్రి, వాహనాల కొనుగోలుకు వీటిని వినియోగించాల్సి ఉంటుంది. గతంలో విడుదలైన నిధులు, వినియోగం తదితర అంశాలకు సంబంధించి వివరాలను సమర్పించాలి. ఉమ్మడి జిల్లాలోని వరంగల్ కార్పొరేషన్, 9 పురపాలికలకు మొత్తం రూ. 97863789 మంజూరయ్యాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివరాలు (రూ.లలో)

పురపాలిక	విడుదలైన నిధులు
వరంగల్(కా.)	70120849
జనగామ	4421374
భూపాలపల్లి	5247185
పరకాల	2301994
డోర్నకల్	1224600
మహబూబాబాద్	6062481
మరిపెడ	1544914
తొర్రూరు	2062493
నర్సంపేట	3266607
వర్ధన్నపేట	1611292

వైద్య విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించడానికి 'క్రితి' సదస్సు

● కేఎంసీలో రెండురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు



మాట్లాడుతున్న కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి, క్రితి సదస్సు కన్వీనర్ డా.సుజిత్ ఆర్ పున్నం, డా.వేణుజి బత్తిని, జూనియర్ వైద్యులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఈ నెల 25, 26 తేదీల్లో కాకతీయ మెడికల్ కాలేజీ(కేఎంసీ)లోని ఎన్ఆర్ఐ భవనంలో కాకతీయ రీసెర్చ్ ఇన్షియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్నోవేషన్స్(క్రితి) పేరిట కాకతీయ పరిశోధన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కేఎంసీ యూఎస్ఏ అల్యూమిని, 'క్రితి' సదస్సు కన్వీనర్ డా.సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు జి. బత్తిని తెలిపారు. గురువారం కేఎంసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డితో కలసి వారు పరిశోధన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులను క్లినికల్ వైద్యంతో పాటు పరిశోధన వైపు మళ్లించడానికి రాష్ట్రంలోనే మొదటిసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనడానికి దేశ నలుమూలల నుంచి 1000 మందికిపైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. దక్షిణ భారత దేశంలోనే అత్యధిక పారితోషికం రూ.3 లక్షలతో పాటు పరిశోధనలో అభిరుచి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు.

తొమ్మిదిరకాల పోటీలు..: అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఉద్దేశించిన 9రకాల పోటీలు ఇందులో ఉంటాయన్నారు. 350 మందికి పైగా విద్యార్థులు తుదిపోటీల్లో ప్రతిష్ఠాత్మక సత్కారాల కోసం పోటీపడతారన్నారు. రెండురోజుల పాటు సాగే కార్యక్రమంలో ఈ నెల 25న మొదటిరోజు డిబేట్, హ్యాకథాన్, జెపార్డీ(ఇండియాలోనే అతిపెద్ద మెడ్‌క్విజ్), రెండోరోజు ఈ నెల 26న పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, సింపోజియం పోటీలు ఉంటాయన్నారు. ముఖ్య అతిథులుగా కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.కరుణాకర్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా.సంధ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.కాళీప్రసాదరావు, ఏపీఐ అధ్యక్షుడు డా.సతీష్‌కతులా హాజరవుతారన్నారు. సమావేశంలో క్రితి కేఎంసీ విద్యార్థుల విభాగం ప్రతినిధులు డా.శశాంక్, రోహిత్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం..!



లక్నవరం జలాశయం, (గోవిందరావుపేట), న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలం లక్నవరం జలాశయంలోని కాకరకాయల బోడు(ఐలాండ్)పై సుమారు 18 నెలల క్రితం చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకం స్వదేశీ దర్శన్‌లో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణానికి సుమారు రూ.15 లక్షల నిధులు కేటాయించారు. వివిధ కారణాలతో నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలాశయంలోకి నీరు సమృద్ధిగా చేరడంతో.. పర్యాటకుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో సందర్శకులు మరుగుదొడ్ల గురించి ఆరా తీస్తున్నారు. తీరా చూస్తే అవి ఇంకా నిర్మాణ దశలోనే ఉండటంతో.. తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పది రోజుల్లో పూర్తి చేస్తాం..

- విజయ్, ఏఈ, టీఎస్‌టీడీసీ

కొన్ని కారణాలతో పనులు పూర్తి చేయడంలో జాప్యం జరిగింది. ఇటీవలే తిరిగి పనులు మొదలుపెట్టాం. నల్లా కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. కొన్ని చిన్న పనులు మిగిలి ఉన్నాయి. పది రోజుల్లో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

ములుగు రూరల్, న్యూస్‌టుడే: సమస్యలపై ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. జిల్లా ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు ములుగు మండలంలోని జంగాలపల్లి, బంజారుపల్లి గ్రామాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు హాజరైన ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలకు ఎదురయ్యే సమస్యల గురించి తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో నేరాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయని, వ్యక్తిగత వివరాలు ఎవ్వరికి చెప్పొద్దన్నారు. మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో విష పురుగుల సంచారం

అకినేపల్లి మల్లారం (మంగపేట), న్యూస్‌టుడే: అకినేపల్లిమల్లారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విషపురుగులు సంచరిస్తున్నాయి. పాములు, తేళ్లు తరుచూ వస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. గురువారం పాఠశాల వరండాలోకి రక్తపింజర రావడంతో విద్యార్థులు భయాందోళకు గురయ్యారు. స్థానికులకు చెప్పడంతో.. వెంటనే దానిని చంపివేశారు. రెండు రోజుల క్రితం తరగతి గదిలోకి తేలు వచ్చిందని, ఆవరణ అంతా గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారిందని, పంచాయతీ అధికారులకు చెప్పినప్పటికి పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



వరండాలోకి వచ్చిన రక్త పింజర



తేలు

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140

ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

ఇసుక తొలగింపు



పూరేడుపల్లి(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని పూరేడుపల్లి ప్రాథమిక పాఠశాల గేటు ముందు ఇసుక నిల్వతో విద్యార్థులు నడవటానికి ఇబ్బందిగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి సుధారాణికి చెప్పడంతో ఆమె స్పందించారు. పంచాయతీ సిబ్బందితో పాఠశాల గేటు ముందు ఉన్న ఇసుకను తొలగించారు.

స్పందనకు వందనం

చేతి పంపు బాగు



వెంకటాపూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలోని చేతిపంపు మూడు రోజుల క్రితం పాడైపోయిందని ఉపాధ్యాయులు, విద్యార్థులు సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దామోదర్‌కి వివరించగా.. ఆయన స్పందించారు. పంపు మెకానిక్‌ను పిలిపించి బాగు చేయించాం

సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు చెకుముఖి పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈవో మేనక, ఉపాధ్యాయులు

మంగపేట, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగపేట మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద గురువారం చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష పోస్టర్‌ను ఎంఈవో పొదెం మేనక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన ఆసక్తి పెంచేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని, ఇలాంటి కార్యక్రమాలు జన విజ్ఞాన వేదిక చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డి శ్రీనివాస్, హెల్త్ సబ్ కమిటీ కన్వీనర్ మునిగాల రాకేశ్, సమతా కమిటీ కో కన్వీనర్ అనిత, యూటీఎఫ్ నాయకుడు ములుకాల వెంకటస్వామి, సభ్యులు ఉప్పతల ప్రసాద్, శ్రీధర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్టు



వెంకటాపురం పోలీసుసేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ కుమార్

వెంకటాపురం, న్యూస్‌టుడే: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు వెంకటాపురం సీఐ బండారి కుమార్ తెలిపారు. భద్రాచలం నుంచి గంజాయిని తీసుకొచ్చి వెంకటాపురం ప్రాంతంలో విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో తనిఖీలు నిర్వహించామన్నారు. మరికాల గ్రామానికి వెళ్లేదారిలో పాలెం ప్రాజెక్ట్ పాత భవనం సమీపంలో ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారని, వారిని వెంబడించి పటుకున్నామన్నారు. అందులో ఓ వ్యక్తి పారిపోయాడని, నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా చూచిరేవులగూడెంకు చెందిన తోకల దుర్గాప్రసాద్ భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం భూపతిరావుకాలనీలో ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడని, ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని రంగరాజపురానికి చెందిన ప్రశాంత్‌కుమార్, నేలారిపేటకు చెందిన గుండమల్ల రోహిత్, కుర్సం నీల మణికంఠగా ఒప్పుకొన్నారన్నారు. వారి వద్ద ఉన్న సంచిలో సుమారు ఐదు కిలోల గంజాయి లభ్యమైందని, దీనివిలువ సుమారు రూ.1.27 లక్షలు ఉంటుందన్నారు. నలుగురిని రిమాండ్ చేశామని సీఐ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య



ఎన్.అరవింద్ (పాతచిత్రం)

వాజేడు, న్యూస్‌టుడే: తండ్రి మందలించాడనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వాజేడు మండలంలోని మండపాకలో జరిగింది. వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండపాక గ్రామానికి చెందిన నల్లెబోయిన అరవింద్(21) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇంటి పనిచేయడంలేదని బుధవారం రాత్రి తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన అరవింద్ గుర్తుతెలియని పురుగు మందు తాగాడు. గుర్తించిన తండ్రి అరవింద్‌ను ములుగు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి మృతి



సాంబయ్య(పాతచిత్రం)

ములుగు టౌన్, న్యూస్‌టుడే: డయాలసిస్ కోసం వెళ్లి ఆర్టీసీ బస్సులో వస్తుండగా ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం సర్వాపురం గ్రామానికి చెందిన బండి సాంబయ్య(48) కిడ్నీ సమస్యతో గత రెండు నెలలుగా బాధపడుతున్నాడు. బుధవారం హనుమకొండలో డయాలసిస్ చేయించుకుని బస్సులో వస్తుండగా, హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ సమీపానికి రాగానే అస్వస్థతకు గురై మృతి చెందాడు. కండక్టర్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

కలెక్టరేట్‌లో ఐక్యరాజ్య సమితి జెండా ప్రదర్శన



ములుగు, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా 2002ను పురస్కరించుకుని ఐక్యరాజ్య సమితి జెండాను ప్రదర్శించారు. రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతి ఏటా అక్టోబర్ 24న ఐక్యరాజ్య సమితి దినోత్సవంగా పాటిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కార్యాలయ పాలనాధికారి తెలిపారు. కలెక్టర్ భవనంపై ప్రతి రోజు జాతీయ జెండాను ఎగుర వేస్తామని, దీంతో పాటు ఐక్యరాజ్య సమితి జెండాను ఎగురవేస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభ

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండలం బర్లగూడెం పంచాయతీ పరిధిలోని రామవరంలో గురువారం పాయం శ్రీనివాసరావు అధ్యక్షతన పెసా గ్రామసభ నిర్వహించారు. నలభై ఏళ్లుగా సాగులో ఉన్న గిరిజనుల భూములకు పట్టాలు, పర్శికగూడెం గ్రామానికి బోరు మంజూరు, వ్యవసాయ బోర్లకు త్రీఫేస్ కరెంటు, ఇందిరమ్మ ఇళ్లు గిరిజనులకే మాత్రమే ఇవ్వాలని బర్లగూడెం పంచాయతీలోని ఆదివాసీ మెజార్టీ సభ్యులు అంగీకారం మేరకు ఏకగ్రీవంగా తీర్మానం జరిగింది. అనంతరం మాజీ సర్పంచి కొర్స నర్సింహమూర్తి పెసా చట్టం, ఎల్టీఆర్, అటవీ హక్కుల తదితర గుర్తింపు చట్టాలపై కల్పించారు. పంచాయతీ కార్యదర్శి తాటి మౌనిక, పెసా కార్యదర్శి గుండెబోయిన మాంతయ్య, మొబలైజర్ కుచ్చింటి చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

ములుగు, న్యూస్‌టుడే: విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఫీజులు విడుదల చేయకపోతే చదువులు ఎలా కొనసాగుతాయని ప్రశ్నించారు. కార్యక్రమానికి జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఏ స్టాలిన్ హాజరై మాట్లాడుతూ.. వెంటనే బకాయిపడిన ఫీజులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు భారీ ర్యాలీతో వచ్చి కలెక్టర్ కార్యాలయంలోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో గేటు బయట బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్, నాయకులు అనుముల రాజ్‌కుమార్, వేణు, ఆవాల హతీష్, భాక్యరోహిత్, శిరీష, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



శిబిరంలో పాల్గొన్న సీఐ, ఎస్సై, తదితరులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా వెంకటాపురం మండలకేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన పలువురు యువత, పోలీసులు రక్తదానం చేశారు. రక్తదానం చేయడం సామాజిక బాధ్యత అన్నారు. సీఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో వాజేడు ఎస్సై హరీశ్, చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సాయిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



బీసీ బాలుర వసతిగృహంలో

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి పవన్‌కల్యాణ్ విద్యార్థులను పరీక్షించి మందులను అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య శిబిరాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు జ్యోతి, మనోహర్, డీపీఎంవో సత్యనారాయణ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

వసతిగృహాల్లో అధికారుల నిద్ర



ములుగు: ఇంచెర్ల శివారులోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్‌లో తహసీల్దారు విజయభాస్కర్

ములుగు, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర ఆదేశాల మేరకు గురువారం రాత్రి జిల్లాలోని హస్టళ్లలో అధికారులు నిద్ర చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 31 వసతి గృహాలను ఎంపిక చేశారు. మండల ప్రత్యేక అధికారి మొదలుకొని ఎంపీడీవోలు, తహసీల్దార్లు వసతిగృహాల్లో నిద్ర చేశారు. సాయంత్రం 6 గంటల వరకు అధికారులు నిర్దేశించిన హాస్టల్ వద్దకు చేరుకొని తనిఖీలు ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తనిఖీకి వెళ్లిన అధికారి, హోదా, తేదీలతో పాటు మొత్తం 72 అంశాలపై ఓ ప్రత్యేక నమూనా రూపొందించి ప్రతి అంశంపై పరిశీలించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు హాస్టల్ నిద్రకు వెళ్లిన అధికారులు ప్రతి అంశాన్ని పరిశీలించారు. తనిఖీ, నిద్రకు వెళ్లిన అధికారులు తప్పనిసరిగా హాస్టల్ స్థితిగతులపై నివేదిక సమర్పించనున్నారు.



ములుగులోని బాలుర హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్



తాడ్వాయిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సుమనవాణి

కాళేశ్వరం అభివృద్ధికి త్వరితగతిన అంచనాలు



గోదావరి తీరం వద్ద పరిశీలిస్తున్న పాలనాధికారి రాహుల్‌శర్మ

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వరాన్ని ఆలయపరంగా, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు త్వరితగతిన అంచనాలు పూర్తి చేయాలని వివిధ శాఖల అధికారులకు జిల్లా పాలనాధికారి రాహుల్‌శర్మ దిశానిర్దేశం చేశారు. ఆయన గురువారం కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి కాళేశ్వరం అభివృద్ధిపై ఈవో సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఇటీవల జరిగిన సమావేశాల్లో చర్చించిన, అధ్యయనం చేసిన అంచనాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో జాప్యం చేయవద్దని సూచించారు. 100 గదుల అతిథి గృహం, నిత్యాన్నదాన సత్రంతో పాటు మరికొన్ని పెండింగ్ నిర్మాణాల కోసం నిధులు మంజూరైనా టెండర్లను పిలవడంలో నిర్లక్ష్యం ఎందుకని పంచాయతీరాజ్‌శాఖ అధికారులను మందలించారు. గోదావరి తీరం వద్ద శాశ్వత ప్రాతిపదికన మహిళల దుస్తుల మార్పిడి గదులు, సులభ్ కాంప్లెక్సు నిర్మాణాలకు సంబంధించి స్థలాలను పరిశీలించారు. వచ్చే ఏడాది జరిగే సరస్వతీ పుష్కరాల కోసం భక్తుల వాహనాల నిలుపుదలకు ప్రైవేటు స్థలాలను ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ఆలయానికి సమీపంలోని ప్రాశస్త్యమైన గుండం చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. అంతర్‌రాష్ట్ర వంతెన వద్ద విద్యుత్ దీపాలు అమర్చడానికి విద్యుత్ శాఖ ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. మురుగు కాల్వల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు, పంచాయతీరాజ్ ఈఈ దిలీప్, ఆలయ ఈవో మారుతి, అధికారులు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌లో సమావేశం : మంత్రి శ్రీధర్‌బాబు ప్రాతినిథ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని కాళేశ్వరం, మంథని, రామగిరిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు శుక్రవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు దేవాదాయ, పర్యాటక శాఖతో పాటు ఇతర శాఖలతో సమావేశం కానున్నారు. జయశంకర్ జిల్లా పాలనాధికారితో పాటు పెద్దపల్లి జిల్లా పాలనాధికారి, పర్యాటకశాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొంటారని తెలిసింది.

కరపత్రాల ఆవిష్కరణ

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 3న ఏటూరునాగారంలో నిర్వహించ తలపెట్టిన ఆ పార్టీ మహా సమ్మేళన కరపత్రాలను గురువారం ఏటూరునాగారంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సరేష్‌మహరాజ్, చరణ్; కిశోర్, రాజశేఖర్, వెంకటేశ్ యాదవ్, రాజేష్, సాయికుమార్, విజయ్, సంజీవ, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



భాజపా జిల్లా అధ్యక్షుడు బలరాంకు వినతి పత్రం ఇస్తున్న బిల్టు కార్మికులు

మంగపేట, న్యూస్‌టుడే: బిల్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కమలాపురం బిల్టు కార్మికులు గురువారం భాజపా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాంకు ములుగు జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. బిల్టు కర్మాగారంలో 40 ఏళ్లుగా పని చేశామని, కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా యాజమాన్యం ఇబ్బందులకు గురిజేసిందన్నారు. 2014లో పల్ఫ్ ఉత్పత్తికి డిమాండ్ లేదనే సాకుతో కర్మాగారంలో ఉత్పత్తి నిలిపివేసి అర్ధాంతరంగా బయటకు పంపించిందని, అప్పటి నుంచి రాస్తారోకోలు, ధర్నాలు చేసినప్పటికి ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి కార్మికుల వేతనాలు, ఇతర అలవెన్సులు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటనారాయణ పంజాల సత్యనారాయణ, బాలగాని కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



మానేరువాగు పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల, న్యూస్‌టుడే : చిట్యాల, టేకుమట్ల పరిధిలోని మానేరు వాగు నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. గురువారం ఆయా మండలాల్లోని కాల్వపల్లి, కలికోట గ్రామాల శివారులోని మానేరు వాగును ఆయన తహసీల్దార్ హేమతో కలిసి సందర్శించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్థానిక అవసరాలకు ఇసుక వాడుకోవాలని సూచించారు. అక్రమంగా లాభార్జనే ధ్యేయంగా ఇసుక వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక తరలించే వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్, ధ్రువీకరణ పత్రాలు, బీమా, డ్రైవర్‌లకు లైసెన్స్‌లు ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై శ్రావణ్‌కుమార్, గిర్దావర్ రాజు పాల్గొన్నారు.

అడవిలో దారితప్పిన యువకుడు.. కాపాడిన పోలీసులు



బయటకు తీసుకొచ్చిన యువకుడితో పోలీసులు, గ్రామస్థులు

మల్హర్, న్యూస్‌టుడే : అటవీ ప్రాంతంలో దారితప్పిపోయిన యువకుడిని పోలీసులు రక్షించారు. దాదాపు రెండు గంటలు శ్రమించి ప్రాణాలతో బయటకు తీసుకొచ్చారు. ఖమ్మంకు చెందిన జస్వ అనే యువకుడు ద్విచక్రవాహనంపై పని నిమిత్తం మంచిర్యాల వెళ్లి బుధవారం తిరుగు పయనమయ్యారు. మల్హర్ మండలం కిషన్‌రావుపల్లి నుంచి అడవిలోని కాలిబాట ద్వారా భూపాలపల్లి చేరుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో కిషన్‌రావుపల్లికి చేరుకోగానే చీకటిపడింది. గూగుల్ మ్యాప్ ఆధారంగా వెళ్తుండగా.. రాత్రి 11.30 గంటల సమయంలో అడవిలో దారితప్పిపోయాడు. ద్విచక్రవాహనం చెడిపోయింది. చిమ్మచీకట్లో ఎటూవెళ్లలేని పరిస్థితి. దీంతో భయాందోళనకు గురై 100 నెంబర్‌కు ఫోన్ చేశారు. స్పందించిన కొయ్యూర్ ఎస్సై నరేష్ భయపడొద్దని ఎప్పటికప్పుడు ధైర్యం చెప్పారు. గ్రామస్థుల సహకారంతో దాదాపు రెండు గంటల పాటు అడవిలో వెతికారు. ప్రాణ భయంతో ఉన్న జస్వను ఎట్టకేలకు బయటకు తీసుకురావడంతో ఉత్కంఠ వీడింది. చెడిపోయిన ద్విచక్రవాహనానికి మరమ్మతు చేయించి ఎస్సై సురక్షితంగా ఇంటికి పంపించారు. ఎస్సై నరేష్, కానిస్టేబుల్ రమేష్, ఇతర పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు, గ్రామస్థులు అభినందించారు.

హుండీల నగదు లెక్కింపు వాయిదా

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వరం దేవస్థానం ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల హుండీల నగదు లెక్కింపు ఈ నెల 28కు వాయిదా వేసినట్లు ఈవో మారుతి తెలిపారు. శుక్రవారం హుండీల నగదు లెక్కించాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఆయన చెప్పారు.

పాఠశాలల వంటపాత్రలకు నిధులు మంజూరు

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభమైనప్పుడు అందించిన వంటపాత్రలు మినహా ఇప్పటి వరకు మళ్లీ వాటిపై దృష్టి సారించ లేదు. కాలం చెల్లిన పాత్రలతో వంటలు రుచికరంగా ఉండక పోవడంతో పాటు ఇబ్బందులు పడుతున్నామని వంట ఏజెన్సీ మహిళలు ప్రభుత్వ గమనానికి తీసుకెళ్లినా పెద్దగా ఫలితం లేకుండా పోయింది. కొత్తగా ప్రభుత్వం వంటపాత్రల కొనుగోళ్లకు నిధులు మంజూరు చేసింది.

ఉమ్మడి జిల్లాల వివరాలు..

జిల్లా	నిధులు మంజూరు (రూ.లలో)
జనగామ	44,15,000
మహబూబాబాద్	70,95,000
భూపాలపల్లి	32,40,000
ములుగు	33,95,000
హనుమకొండ	50,65,000
వరంగల్	52,30,000

పాత్రలు ఇవి..

తెల్ల అన్నం వండే గిన్నెలు(బగోనా అనికూడా పిలుస్తారు), ఇంగ్రీడియంట్స్ కోసం స్టీలు కంటైనర్లు, వండిన వాటిని వడ్డించేందుకు స్టీలు బకెట్లు, అన్నం వడ్డించే కఫ్గిర్(స్థానికంగా హస్తం అంటారు), కూరలు వడ్డించేందుకు గంటెలు తదితరాలను ప్రతి బడికి అందిస్తారు.

☛ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాత్రలను అందించేందుకు జిల్లా విద్యాశాఖకు నిధులు మంజూరు చేసింది. కొద్ది రోజుల్లోనే సరఫరాకు బహిరంగ టెండర్లు పిలువనున్నారు. జిల్లా స్థాయిలో వంటపాత్రల సరఫరాకు అన్ని రకాల అర్హతలున్న పంపిణీదారుల నుంచి టెండర్లు ఆహ్వానించి పాత్రల కొనుగోలు బాధ్యతలు అప్పగిస్తారు.



కాలం చెల్లిన పాత్రలతో వంట వండుతున్న మహిళలు

పల్లెలు ప్రగతి సాధించడమే లక్ష్యం

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : పల్లెలు ప్రగతి సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని ఇప్పలపల్లి, మేదరమెట్ల గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పలపల్లి నుంచి పోతుగల్ గ్రామం మీదుగా కొర్కిశాల గ్రామం వరకు రూ.3 కోట్ల 12 లక్షలు, మేదరమెట్ల గ్రామం నుంచి అంకుషాపూర్ వరకు రూ.కోటి 67 లక్షల నిధులు బీటీ రోడ్ల నిర్మాణానికి కేటాయించినట్లు ఆయన వివరించారు. గ్రామాభివృద్ధే రాష్ట్రాభివృద్ధిగా భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు తగిన నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మహమ్మద్ రఫీ, పీఏసీఎస్ ఛైర్మన్ సంపెల్లి నర్సింగరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కటంగూరి వెంకటరాం నర్సింహారెడ్డి, నాయకులు కుమారస్వామి, రాము, పున్నంచందర్‌రావు, లింగారావు, రవికుమార్ పాల్గొన్నారు.